క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి మంత్రి ఉత్తమ్ పరామర్శ


ముత్తమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ కస్తాల శ్రవణ్‌కుమార్ తల్లి, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షురాలు కాస్తాల ముత్తమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం రాత్రి మృతురాలి కుటుంబాన్ని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ముత్తమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు షీల్డ్‌లు, మెడల్స్ అందజేత


విద్యార్థులకు షీల్డ్‌లు, మెడల్స్ అందజేస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి

మునగాల : మండల కేంద్రంలోని సాయి గాయత్రి విద్యాలయంలో అబాకస్‌పై ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు నిర్వహించిన పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఏఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా షీల్డ్‌లు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే విద్యార్థులు పరీక్షలలో నైపుణ్యం సంపాదించి భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరాలని అన్నారు. ఇటువంటి పరీక్షలు నిర్వహించి బహుమతులను ఇచ్చి ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, పాఠశాల చైర్మన్ అర్వపల్లి ఉషారాణి, ఏఓ రెణబోతు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : మే 1వ తేదీన నిర్వహించబోయే మే డేను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో జరిగిన సీపీఐ ప్రజా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, మండల కార్యదర్శి సింహాద్రి, రావుల సత్యం, లక్ష్మి తదితరులు ఉన్నారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయొద్దు

గరిడేపల్లి : గృహజ్యోతి పథకానికి అర్హులైన వారి వద్ద నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేయవద్దని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మండవ నాగేశ్వరరావు గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన గరిడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. న్ని నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో 33 కేవీ ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మలు తొలగించనున్నందున కీతవారిగూడెం, పొనుగోడు సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రావిరాల నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 33/11 కేవీ గరిడేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పొనుగోడు ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున పొనుగోడు ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

మునగాల మండల కేంద్రంలో..

మునగాల : మునగాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ఏఈ వికాస్, లైన్‌మెన్ మారం వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయనున్నందున విద్యుత్ నిలిపివేయబడుతుందని, కావున మండల కేంద్రంలో గల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

బజార్ హమాలీల చార్జీలు పెంచాలని వినతి

హుజూర్‌నగర్ : వ్యాపారులు బజార్ హమాలీల చార్జీలను పెంచాలని టీఆర్‌ఎస్ కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణ వర్తక సంఘం నాయకుడు వి.రమేష్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్మికులతో చేసుకున్న ఒప్పంద కాల పరిమితి ముగిసినందున నూతన ఒప్పందం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, శ్రీను, వెంకన్న, రామన్న, ధనంజయ, కోటేశ్వరరావు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

సకాలంలో అందని వేతనాలు

- ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాలుగా కూలి డబ్బులు పెండింగ్
- పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు


బూరుగడ్డలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

హుజూర్‌నగర్‌రూరల్ : ఉపాధి హామీ కూలీలకు సమయానికి వేతనాలు రావడం లేదు. ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తే వచ్చిన కూలితో కడుపు నింపుకునే కష్టజీవులకు ఆరు వారాలుగా వేతనాలు రాకపోవడంతో కూలీలు అల్లాడిపోతున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా పని చేస్తున్న వీరికి వారం రోజుల్లోనే వేతనాలు చెల్లించాల్సి ఉన్నా ఆరు వారాలుగా చెల్లింపులు నిలిచిపోయాయి.

2500 మంది కూలీలు హాజరు

మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో 14 ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. మండలంలో మొత్తం 7151 జాబ్ కార్డులు ఉండగా ఉపాధి హామీ పనులకు 2500 మంది కూలీలు హాజరవుతున్నారు. కనీస వేతనం రూ.300 గాను కూలీలకు రూ.220 చెల్లిస్తున్నారు. 14 ప్రాంతాల్లో పంట కాలువ, చెక్ డ్యాం, సాగర్ పిల్ల కాల్వలు, చెరువు పూడికతీత పనులు, గుట్ట కందకాలు, నర్సరీకి నీరు పెట్టడం తదితర పనులు జరుగుతున్నాయి.

నిలిచిన వేతనాలు..

ఉపాధి హామీ కూలీలు పనులు చేసిన తరువాత వారికి వారం రోజుల్లోగా చెల్లింపులు జరగాలి. కానీ ఆరు వారాలుగా చెల్లింపులు జరగడం లేదు. దీంతో తమ పొట్ట నిండేది ఎలా అని కూలీలు ప్రశ్నిస్తున్నారు. అయితే ఫిబ్రవరి 15 వరకు చేసిన పనులకు మాత్రమే వేతనాలు ఇచ్చారని అప్పటి నుంచి ఇప్పటివరకు పనికి చెల్లింపులు నిలిచిపోయాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు..

మండుతున్న ఎండల్లోనూ పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతోంది. దీంతో పని ప్రదేశాల్లో నీడ లేక ఎండలో పనిచేస్తున్న కూలీలు సొమ్మసిల్లిపోతున్నారు. కనీసం పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం కూడా లేని పరిస్థితి నెలకొంది. గడ్డపార, పారలు కూడా ప్రభుత్వం అందించడం లేదు.

కేవలం రూ.27 చార్జీ చెల్లింపుతో నష్టం

ఉపాధి హామీ కూలీలు గ్రామం నుంచి పని ప్రదేశాలకు సుమారు 4 నుంచి 5 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోంది. దీనికి గాను అధికారులు రూ. 27 చార్జీ చెల్లిస్తున్నారు. కానీ ట్రాక్టర్లు, ఆటోలు, వ్యాన్ డ్రైవర్లు కూలీల వద్ద నుంచి రూ. 30 నుంచి 40 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో తమకు నష్టం జరుగుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమయానికి వేతనాలు చెల్లించాలి


“ ఉపాధి హామీ పనులకు నేను నా భార్య కలిసి వెళుతున్నాం. ఆరు వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదు.. దీంతో నిత్యావసర సరుకులు అప్పు చేసి కొని తెచ్చుకొని పొట్ట నింపుకుంటున్నాం. చాలా ఇబ్బందిగా పడుతున్నాం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వారం రోజుల్లోగా చెల్లింపులు చేయాలి. ప్రతి వారం రోజులకొకసారి వేతనాలు చెల్లించాలి.

– గూడెపు అంజయ్య, ఉపాధి హామీ కూలీ, బూరుగడ్డ

పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేవు


“ మండుటెండల్లో పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యాలు లేవు. ఉపాధి హామీ అధికారులు గడ్డపార, పారలు ఇవ్వడం లేదు. చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారు.

– బాతుక సైదులు, ఉపాధి హామీ కూలీ, అమరవరం

కాంగ్రెస్ పార్టీలో పులువురి చేరిక


పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ ఉపేందర్

మునగాల : మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సుమారు 50 మంది గురువారం రాత్రి కోదాడలో ఎమ్మెల్యే ఎన్.పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో ఉన్న పార్టీ మండల నాయకుడు నల్లపాటి శ్రీనివాస్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని పద్మావతి గెలుపునకు తీవ్రంగా కృషిచేశారు. కానీ ఆనాటి నుంచి ఆయన అనుచరులు మాత్రం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగారు. గురువారం వారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోచేరారు. దీంతో మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ అయోమయంలో పడింది.

కాంగ్రెస్‌లోకి మునగాల మాజీ సర్పంచ్

మునగాల తాజా మాజీ సర్పంచ్ చింతకాయల ఉపేందర్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, కొప్పుల జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బంగారపు బ్రహ్మం, బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు పాషా, ముస్లిం మైనార్టీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బెజవాడ గోవర్ధన్, సొంపంగు గోపి, రంగుల రాంబాబు, లంజేపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్ సత్యనారాయణ

నడిగూడెం : నడిగూడెం గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు చిల్లంచర్ల సత్యనారాయణ గురువారం కోదాడలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, నాయకులు గుండు శ్రీనివాస్, బోళ్ల నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు- నివారణ చర్యలపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

హుజూర్‌నగర్ : అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 'అగ్ని ప్రమాదాలు – నివారణ చర్యల'పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది రవిబాబు, సురేందర్ రెడ్డి, సైదులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెంలో హోరాహోరీగా ఎడ్ల పందేలు


బండ లాగుతున్న గిత్తలు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో శ్రీకోదండరామస్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు శుక్రవారం ఫ్లడ్ లైట్ల వెలుతురులో హోరాహోరీగా అర్ధరాత్రి వరకు కొనసాగాయి. కృష్ణా, గుంటూరు, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన సుమారు 12 జతల గిత్తలు పోటీలో తలపడ్డాయి. కాగా, పోటీలను నిర్వాహకులు ప్రారంభించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య, ఎన్నారై షేక్ మౌలాలి, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీటీసీ చెన్నయ్య, వెంకటనారాయణ, జమీల్, నిజామ్, భద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు


జిల్లా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోదాడ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

కోదాడ : కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం సూర్యాపేటలో జిల్లా న్యాయమూర్తి రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోదాడ కోర్టు నూతన భవన సముదాయం పనులు వెంటనే చేపట్టాలని, కొత్తగా మంజూరైన సబ్ కోర్టుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని న్యాయమూర్తిని కోరారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఆర్ కె.మూర్తి, చింతకుంట్ల రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు గట్ల నర్సింహారావు, హనుమంతరాజు, కోడూరి వెంకటేశ్వరరావు, మందా వెంకటేశ్వర్లు, హేమలత, దొడ్డా శ్రీధర్, సామా నవీన్, ఎస్.కె నాగుల్ పాషా, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్లు దగ్ధం


లింగగిరిలో కాలిపోయిన హరితహారం చెట్లు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరి గ్రామ శివారులో హుజూర్‌నగర్ రహదారి పక్కన హరిత హారం చెట్లు దగ్ధమయ్యాయి. కొందరు రైతులు రోడ్డు పక్కన పొలాల్లో వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాప్తించి సుమారు 40కి పైగా హరిత హారం చెట్లు కాలిపోయినట్లు పలువురు స్థానికులు తెలిపారు. కాగా, వేసవిలో హరితహారం మొక్కలను అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కోదాడరూరల్ : తాగునీటి కోసం వెళ్లి బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని కొమరబండ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరబండ గ్రామానికి చెందిన దాసరి వెంకన్న(48) గ్రామంలోని గేదెలను(జంగిడిలు) మేతకు తీసుకెళ్తుంటాడు. రోజువారిగానే గేదెలను మేతకు తీసుకెళ్లిన వెంకన్న తాను వెంట తెచ్చుకున్న మంచినీరు ఐపోవడంతో పక్కన ఉన్న బావిలోకి నీరు తాగేందుకు దిగాడు. బావి ఒడ్డున ఉండి నీరుతాగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ బావిలో పడి ఈతరాకపోడంతో మృతి చెందాడు. అటుగా వెళ్లిన కొందరు బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని బయటకు తీసి చూసి వెంకన్నగా గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవితఖైదు

చివ్వెంల : వృద్ధురాలిని హత్య చేసిన ఘటనలో ఓ వ్యక్తికి జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. మోతె మండలంలోని నామవరం గ్రామానికి చెందిన ఆకారపు ముత్తమ్మ భర్త చనిపోవడంతో కూతురు జానమ్మతో కలిసి గ్రామంలో నివసిస్తోంది. ఈ క్రమంలో ముత్తమ్మ పొలం పనులకు రెండు కాడెద్దులను కొనడానికి అదే గ్రామానికి చెందిన గుంటి పూలమ్మ దగ్గర రూ.30వేలు అప్పుగా తీసుకుని ఇంట్లో ఉంచింది. ఈ డబ్బులు తేవడాన్ని చూసిన అదే గ్రామానికి చెందిన దైద మహేందర్ డబ్బులు తనకు ఇవ్వాలని తాగి ఇంటికి వచ్చి గొడవ చేశాడు. దీంతో ముత్తమ్మ మహేందర్‌తో గొడవ పడడంతో ఇరుగు పొరుగు వారు అతడిని అక్కడి నుంచి పంపించారు. మరో రెండు రోజుల తర్వాత మళ్లీ తాగి వచ్చి డబ్బులు ఇవ్వకపోతే చంపుతా అని బెదిరించడంతో అక్కడే ఉన్న కూతురు జానమ్మ అతడితో గొడవపడి అక్కడి నుంచి పంపించి వేసింది. ఈ క్రమంలో ఆగస్టు 2018న ముత్తమ్మను ఒంటరిగా వదిలేసి కూతురు జానమ్మ బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామానికి వెళ్లింది. ఆమె తిరిగి సాయంత్రం 5గంటల సమయంలో ఇంటికి రాగా మహేందర్ ఇంట్లో కనిపించాడు. ఇక్కడకు ఎందుకు వచ్చావు అని జానమ్మ అతడిని అడిగే లోపు ఆమెను చూసి పరారయ్యాడు. ఆమెతో పాటు గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు మహేందర్ పారిపోవడం చూశారు. వెంటనే జానమ్మ ఇంట్లోకి వెళ్లి చూడగా ముత్తమ్మ గొంతు కమిలిపోయి, చెవులోంచి రక్తం కారుతూ విగతజీవిగా పడిఉండడాన్ని గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించింది. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే ముత్తమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శివశంకర్ కేసు నమోదు చేసి నిందితుడి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ కొంపల్లి లింగయ్య నిందితుడికి సెక్షన్ 302 కింద జీవిత ఖైదుతో పాటు, రూ.5వేల జరిమానా విధించారు. అలాగే బలవంతంగా డబ్బులు లాక్కున్న నేరానికి సెక్షన్ 380 కింద ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు, రూ.500జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల మరో రెండు నెలలు అదనంగా శిక్ష విధించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ కె.సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సహకరించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

కోదాడరూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టకుండా కాంటాలు వేయాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కకోదాడ మండల పరిధిలోని తమ్మరబండపాలెం, నల్లబండగూడెం, రెడ్లకుంటలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు నిబంధనల ప్రకారం తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని తెలిపారు. కాంటాలు వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పాలెం రజిని, ఏఈఓలు ఆఫ్రిన్, ఝాన్సీ, పీఏసీఎస్‌ల సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు మంచి రోజులు రానున్నాయి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి


నక్కగూడెంలో ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుతం కష్టకాలంలో ఉన్నప్పటికీ పార్టీకి ముందుందు మంచి రోజులు రానున్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలం నక్కగూడెంలో శ్రీ సీతారామచంద్రమూర్తి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పందేలను మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ సీతారామస్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. ఇంతకంటే కష్టకాలాన్ని బీఆర్‌ఎస్ పార్టీ చవి చూసిందని తెలిపారు. అయినా ఏరోజు కూడా పార్టీ కానీ, నాయకులు కానీ వెనకడుగు వేయలేదని, ఎత్తిన జెండా దించలేదని ఆయన చెప్పారు. రానున్న మంచి రోజులు అన్నీ బీఆర్‌ఎస్‌వేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కళ్ల ముందు పంటలు ఎండిపోతున్నా కనీసం స్పందించని మంత్రులు ఈ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. పోలీసు కేసులు బీఆర్‌ఎస్ పార్టీకి కొత్త ఏం కాదని, అన్నిటిని ఎదుర్కొనే పార్టీ బలంగా నిలబడిందని, ఇక ముందు కూడా అలాగే ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో మూడు రోజుల పాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఉప్పల ఫణింద్రశర్మ, నెమ్మాని వెంకటరమణమూర్తి బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోత్సవాల మధ్య గణపతి పూజ, పుణ్యావచనం, దీక్షాధారణ, పంచగవ్య ప్రాసన, గోపూజ, నవగ్రహ, యాగశాల ప్రవేశం, బ్రహ్మకలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని మధనం ద్వారా యాగశాల ప్రవేశం చేసి దేవతామూర్తుల విగ్రహాలకు జలాధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరామ నామ అక్షింతలు అందజేత


ఆలయ కమిటీకి శ్రీరామ నామ అక్షింతలను అందజేస్తున్న పాల్వాయి రమేష్ దంపతులు

నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఈనెల 21వ తేదీన జరిగే శాంతి కల్యాణ మహోత్సవానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ భక్తురాలు సలువాది మల్లివిష్ణువందన సూక్ష్మ కలతో శ్రీరామ నామంతో లిఖించిన అక్షింతలను స్థానిక ప్రముఖ వ్యాపారి పాల్వాయి రమేష్ దంపతుల శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కాగా, విష్ణువందన 2016 నుంచి 7 లక్షల పైచిలుకు బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని లిఖించి భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవంతో పాటు ఉత్తరప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని అనేక దేవాలయాల్లో జరిగే శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను అందజేశారు.

వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి


కాగితరామచంద్రాపురంలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సతీష్

నడిగూడెం : వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ కోరారు. శుక్రవారం నడిగూడెం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంలో మెగా పల్లె ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. నీటి సౌకర్యం లేకపోతే అత్యవసరంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కాగా, పల్లె ప్రకృతి వనానికి నీటి సౌకర్యం లేకపోవడంతో డబుల్ బెడ్ రూమ్ కాలనీ నుంచి నీరు అందించేలా ఏర్పాటు చేయించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం అర్చకులు చైత్ర శుద్ధ ఏకాదశి, తొలక్కం పూజలతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎంపి లక్ష్మణరావు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, గంగయ్య, నర్సింహారావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, శేషాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

52 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మఠంపల్లి: మండల కేంద్రంలోని వీవీ హైస్కూల్‌లో 1971–72 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన మిత్రులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ బాలరెడ్డి, వెంకటేశ్వర్లు, అప్పిరెడ్డి, స్లీవారెడ్డి, జగదీశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, ఇన్నారెడ్డి, దయాకర్, వెంకటరెడ్డి, ఫాతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అదే విధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీ నరసింహ మూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.